క్లుప్తంగా

రేషన్ బియ్యం పట్టివేత



పట్టుకున్న రేషన్ బియ్యంతో అధికారులు

సిర్పూర్(టి): సిర్పూర్(టి) రైల్వేస్టేషన్‌లో సింగరేణి రైలు ద్వారా మహారాష్ట్రలోని వీరూర్ పట్టణానికి అక్రమంగా తరలించేందుకు సిద్ధంగా ఉన్న రేషన్ బియ్యాన్ని బుధవారం ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ రాజ్‌కుమార్ పట్టుకున్నారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం సిర్పూర్(టి) రైల్వేస్టేషన్ నుంచి మహారాష్ట్రలోని వీరూర్ పట్టణానికి సింగరేణి ప్యాసింజరు రైలు ద్వారా 5 క్వింటాళ్ల 5 కిలోల రేషన్ బియ్యం తరలించేందుకు ప్లాట్‌ఫారం మీద సిద్ధంగా ఉందనే సమాచారం మేరకు తనిఖీలు నిర్వహించి పట్టుకున్నామన్నారు. బియ్యం అక్రమ రవాణాదారులు బియ్యం వదిలిపెట్టి పారిపోయారని, పూర్తి విచారణ చేపట్టి తగు చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

దేవార వినోద్‌కు అవార్డు



అవార్డు ప్రదానం చేస్తున్న అకాడమీ సభ్యులు

రెబ్బెన: ఆధ్యాత్మిక సేవలతోపాటు పలు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న ఇందిరానగర్ కనకదుర్గాదేవి, స్వయంభూ మహంకాళి ఆలయ ప్రధాన అర్చకుడు దేవార వినోద్‌ను క్రేజీ స్టార్ ఆఫ్ ది ఇయర్ అవార్డు వరించింది. క్రేజీ స్పోర్ట్స్ డ్యాన్స్ అకాడమీ మంగళవారం రాత్రి మందమర్రిలోని సింగరేణి పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో అవార్డు ప్రదానం చేసింది. దేవార వినోద్ మాట్లాడుతూ అమ్మవారి దయతో ఆలయానికి వచ్చే భక్తులకు ఆధ్యాత్మిక సేవలతో పాటు పేదలకు సాయంగా నిలుస్తున్నట్లు పేర్కొన్నారు. సేవా కార్యక్రమాల నిర్వహణకు సహకరించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు.

వేతనం కోసం మల్టీపర్పస్ వర్కర్ల ఆందోళన

నార్నూర్: గ్రామపంచాయతీ పరిధిలో పని చేస్తున్న మల్టీపర్పస్ వర్కర్ల వేతనాన్ని వెంటనే విడుదల చేయాలని ఆందోళన చేపట్టారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు. మండల అధ్యక్షుడు జిల్లెపల్లి బాపూరావు మాట్లాడుతూ మల్టీపర్పస్ వర్కర్లకు నెలల తరబడి వేతనాలు మంజూరు చేయకపోవడంతో ఆర్థిక పరిస్థితిని ఎదుర్కొంటున్నామని వాపోయారు. కుటుంబ పోషణ భారంగా మారుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. మల్టీపర్పస్ వర్కర్లపై చిన్నచూపు తగదని అన్నారు. అధికారులు ఇచ్చే చెక్కులను తీసుకొని బ్యాంకుల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. ఎంపీడీవో జవహర్‌లాల్ హామీతో మల్టీపర్పస్ వర్కర్లు ఆందోళన విరమించారు.

అటవీ గ్రామాలపై అధ్యయనం



కొత్తపల్లిలో వివరాలు సేకరిస్తున్న రోహిత్

లింగాపూర్(ఆసిఫాబాద్): అటవీ ప్రాంతాలకు సమీపంలో ఉండే గ్రామాల్లో నివసిస్తున్న ప్రజల జీవన విధానం, వారి స్థితిగతులపై ఫారెస్ట్ కాలేజ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ పీహెచ్‌డీ విద్యార్థి రోహిత్ అధ్యయనం చేపట్టారు. బుధవారం లింగాపూర్ మండలంలోని జోడేఘాట్ రేంజ్ పరిధిలో ఉన్న పిట్టగూడ, పిక్లాతండా, కొత్తపల్లి, మోతీపటార్ గ్రామాల్లో వివరాలు సేకరించారు. అడవిపై ఆధారపడి జీవిస్తున్న వారితో మాట్లాడారు. అటవీశాఖ అధి కారులు అనుష, మహేశ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

వందశాతం ఫలితాలు సాధించాలి

నార్నూర్: పదో తరగతి పరీక్షల్లో వందశాతం ఫలితాలే లక్ష్యంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని జీసీడీవో మెస్రం ఛాయా అన్నారు. బుధవారం మండలంలోని మాన్కాపూర్, జామ్డా, నార్నూర్ బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలను ఆమె సందర్శించారు. ఈనెల 6 నుంచి 15 వరకు విద్యార్థులకు నిర్వహించే ప్రీఫైనల్ పరీక్షలపై ఆరా తీశారు. విద్యార్థులకు సంబంధించిన హెల్త్ కార్డులను పరిశీలించారు. ఆమె వెంట పీజీహెచ్‌ఎంలు చౌహాన్ వందన, జాదవ్ విటల్, వార్డెన్ పవార్ వనిత, తదితరులు పాల్గొన్నారు.

దహెగాంలో రోడ్డుకిరువైపులా మొక్కలు నాటడానికి గుంతలు తవ్వుతున్న ఉపాధి కూలీలు



నిధులు వృథా..!

- ఉపాధిహామీ పనుల్లో అధికారుల నిర్లక్ష్యం
- వర్షాకాలంలో నాటే మొక్కలకు ఇప్పుడే గుంతలు
- ఇవేం పనులంటూ పలువురు అసహనం

దహెగాం: పనులు లేక పేదరికంతో ఇతర ప్రాంతాలకు వలస పోతున్నారనే ఉద్దేశంతో ఉన్న గ్రామంలోనే పనులు కల్పించేందుకు, వలసలు నివారించేందుకు కేంద్ర ప్రభుత్వం జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకాన్ని తీసుకొచ్చింది. ఉపాధిహామీ పథకంలో అర్హులైన ప్రతీ ఒక్కరికి పని కల్పిస్తున్నారు. చేస్తున్న పనులు సైతం నలుగురికి ఉపయోగపడేలా ఉండాలి. అలాంటిది వర్షాకాలంలో నాటే మొక్కల కోసం వేసవిలోనే గుంతలు తవ్వడమేంటని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇంత త్వరగా గుంతలు తవ్వితే వర్షాకాలం నాటికి గుంతలు కూడుకుపోకుండా ఉంటాయా అన్ని ముక్కున వేలేసుకుంటున్నారు. ఇలా పనులు చేయడం ప్రభుత్వ సొమ్మును వృథా చేయడేమనని స్థానికులు మండిపడుతున్నారు.

మండలంలో 7,036 జాబ్‌కార్డులు..

మండలంలో 24 గ్రామ పంచాయతీలలో మొత్తంగా 7,036 మంది జాబ్‌కార్డ్ కలిగి ఉన్నారు. అందులో ఎన్‌రోల్ చేసుకున్న కూలీలు 17,311 మంది ఉన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఇందిరమ్మ ఆత్మీయ భరోసాలో ఉపాధిహామీ పథకంలో పనికి వెళ్లిన వారికి ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కల్పిస్తామని చెప్పడంతో చాలా మంది జాబ్ కార్డులకు దరఖాస్తులు చేసుకుని పనులకు వెళ్తున్నారు. దీంతో కూలీల సంఖ్య కూడా పెరిగిందని అధికారులు పేర్కొంటున్నారు.

1,039 మంది కూలీలు పనికి..

వేసవికి ముందే గ్రామాల్లో పనులను గుర్తించడానికి గ్రామసభలు నిర్వహించి ఎలాంటి పనులు చేపట్టాలో గుర్తించారు. ప్రస్తుతం మండలంలో 1,039 మంది కూలీలు పనులు చేస్తున్నారని ఈజీఎస్ అధికారులు పేర్కొంటున్నారు. మిగితా కూలీలకు కూడా పనులు కల్పిస్తామంటున్నారు. ఎప్పుడు కూలీ పనులకు వెళ్లని వారు కూడా జాబ్‌కార్డు తీసుకుని పనులకు వెళ్తున్నారు. కాగా పనులకు వెళ్లిన వారు పని చేయకుండా కాలక్షేపం చేసి హాజరు వేసుకుని కూలీ పొందుతున్నారని పలువురు ఆరోపిస్తున్నారు.

గుంతలు తవ్వడం ఇప్పుడేనా..?

ఈజీఎస్‌లో కూలీలకు పని కల్పించడానికి అనేక రకాల పనులు ఉంటాయి. కానీ మండల కేంద్రంలో ఈజీఎస్ అధికారులకు ఏ పని దొరకనట్లుగా మొక్కలు నాటడానికి ఇప్పుడు గుంతలు తవ్విస్తున్నారు. వేసవిలో తవ్విన గుంతలలో వర్షాకాలంలో మొక్కలు నాటుతారు. వర్షాకాలం వరకు ఈ గుంతలు ఉంటాయా..? అని పలువురు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఈజీఎస్‌లో అవసరమయ్యే పనులు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

పనులు ఆపేశాం..

మండల కేంద్రంలో ఉపాధిహామీ పథకంలో రోడ్డు కిరువైపులా మొక్కలు నాటడానికి గుంతలు తవ్వుతున్నట్లు గుర్తించి పనులు నిలిపివేశాం. పారంపండ్, హరితవనాల్లో నాటిన మొక్కలకు నీళ్లు పోయడానికి గుంతలు తవ్విస్తున్నాం. ఫిష్‌ఫండ్ (చెరువులో గుంతలు తవ్వడం), చేపల పెంపకం కోసం పనులు చేపడుతాం. ప్రతీ ఒక్క కూలీకి పని కల్పిస్తున్నాం.

– కల్పన, ఈజీఎస్ ఏపీవో, దహెగాం

సైబర్‌మోసాలపై అప్రమత్తంగా ఉండాలి



రెబ్బెన: విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై చంద్రశేఖర్



పెంచికల్‌పేట్: విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై కొమురయ్య

రెబ్బెన: సైబర్ మోసాలకు గురికాకుండా ప్రతీ ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై చంద్రశేఖర్ అన్నారు. సైబర్ జాగ్రుత్‌తా దివస్ కార్యక్రమంలో భాగంగా బుధవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రోజురోజుకు సైబర్ నేరగాళ్లు కొత్త పంథాల్లో మోసాలకు పాల్పడుతున్నారన్నారు. ఇలాంటి సమయంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. డిజిటల్ అరెస్టుల పేరుతో వచ్చే ఫోన్‌కాల్స్‌కు ఎవరూ భయపడొద్దన్నారు. సైబర్ నేరాలకు గురైతే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.

పెంచికల్‌పేట్: మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో బుధవారం ఎస్సై కొమురయ్య ఆధ్వర్యంలో విద్యార్థినులకు సైబర్ నేరాలు, జాతీయ భద్రతపై అవగాహన కల్పించారు. ప్రభుత్వం బాలబాలికల రక్షణకు అందిస్తున్న సేవలు తెలియజేశారు. అత్యవసర సమయంలో సేవలను అందిస్తున్న తీరును వివరించారు.

తిర్యాణిలో..

తిర్యాణి: డిజిటల్ నేరాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఎస్సై శ్రీకాంత్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద ఇంటర్ విద్యార్థులకు డిజిటల్ నేరాలపై అవగాహన కల్పించారు. ఎస్సై మాట్లాడుతూ అపరిచిత వ్యక్తులు ఫోన్ చేసి ఓటీపీ అడిగితే ఎట్టి పరిస్థితులల్లో చెప్పొద్దన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి మార్కింగ్



జాముల్‌ధరా గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లకు మార్కింగ్ వేసిన అధికారులు

లింగాపూర్: మండలంలోని జాముల్‌ధరా గ్రామంలో బుధవారం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఎంపీడీవో రామచందర్ ఆధ్వర్యంలో మార్కింగ్ వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాముల్‌ధరా గ్రామ పంచాయతీలో మొత్తం 185 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయని పేర్కొన్నారు. మార్చి15 లోగా అన్ని ఇళ్లు బెస్‌మేంట్ స్థాయిలో నిర్మాణం పూర్తయ్యేలా చూడాలననారు. హౌజింగ్ ఏఈ రత్నం, స్పెషల్ ఆఫీసర్ అరవింద్, పంచాయతీ కార్యదర్శి అంబాజీరావుతో పాటు కాంగ్రెస్ మండలాధ్యక్షుడు లోకేందర్‌జాదవ్, ఆత్రం అనిల్, చవాన్ సునీల్, అడే ఆత్మారాం, సలీం తదితరులు ఉన్నారు.

ఒత్తిడికి గురికాకుండా పరీక్షలు రాయాలి



విద్యార్థినులతో సుమలత

రెబ్బెన: విద్యార్థులు వార్షిక పరీక్షల విషయంలో ఒత్తిడికి గురికాకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలని జిల్లా మహిళా సాధికారత కేంద్రం మోటివేషన్ స్పీకర్ సుమలత అన్నారు. బుధవారం మండలంలోని గంగాపూర్‌లో గల కేజీబీవీలో భేటీ బచావో భేటీ పడావో దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా విద్యార్థులకు ప్రేరణ, స్ఫూర్తిదాయక విషయాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వార్షిక పరీక్షలంటే ఉన్న భయాన్ని దూరం చేసుకోవాలన్నారు. ప్రణాళికబద్ధంగా చదివితే మంచి మార్కులు సాధించడం ఎంతో తేలికన్నారు. పరీక్ష కేంద్రంలో ఒత్తిడి లేకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలన్నారు. నైతిక విలువలు కలిగిన ప్రతీవిద్యార్థి ఉన్నత స్థాయిలో ఉంటారన్నారు. మహిళా సాధికారత జెండర్ స్పెషలిస్టు రాణి, స్పెషల్ ఆఫీసర్ పద్మ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులు పాజిటివ్ దృక్పథం అలవాటు చేసుకోవాలి



ల్యాబ్ పరికరాలు అందజేస్తున్న అధికారి

ఆసిఫాబాద్: విద్యార్థులు పాజిటివ్ దృక్పథాన్ని అలవాటు చేసుకోవాలని ఎంఈవో రాథోడ్ సుభాష్ అన్నారు. జిల్లా కేంద్రంలోని సరస్వతి శిశుమందిర్ పాఠశాలలో మంగళవారం రాత్రి నిర్వహించిన 'ఆచార్య దేవో' కార్యక్రమంలో భాగంగా పదో తరగతి విద్యార్థులు ఉపాధ్యాయులను శాలువాలతో సన్మానించారు. ఎంఈవో మాట్లాడుతూ విద్యార్థులు చిన్నప్పటి నుంచే సమాజ సేవపై ఆసక్తి కలిగి ఉండాలన్నారు. విద్యార్థులు లక్ష్యంతో చదువుకొని ఉన్నత స్థానాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. కెరమెరి దక్కన్ బ్యాంకు మేనేజర్ మల్యాల శ్రీషద్ పాఠశాలకు రూ.10 వేల ల్యాబ్ పరికరాలు అందజేశారు. విద్వత్ పరిషత్ కన్వీనర్ పెండ్యాల సదాశివ్ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు పరీక్షలపై అవగాహన కల్పించారు. పాఠశాల అధ్యక్షులు చిలువేరు వెంకన్న, కార్యదర్శి కొడిప్యాక వేణుగోపాల్, నాగుల శ్రీనివాస్, కల్లూరి సంతోష్, నల్లగొండ రమేశ్, తంగళ్లపెల్లి రమేశ్, కొరిడె మహేశ్, ముక్క కృష్ణమూర్తి, ఆచార్యులు పాల్గొన్నారు.

'భిన్నత్వంలో ఏకత్వం'పై అవగాహన



వేషధారణలో విద్యార్థినులు

వాంకిడి: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం 'ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు భిన్నత్వంలో ఏకత్వంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం నటరాజ్ మాట్లాడుతూ భారతదేశంలోని వివిధ రాష్ట్రాలలో ప్రజలు వేర్వేరు సంప్రదాయాలను పాటిస్తుంటారని, సంప్రదాయాలు వేరైనా భారతీయులుగా అందరి సంస్కృతి, సంప్రదాయాలను గౌరవించాలన్నారు. విద్యార్థి దశలో సంస్కృతులపై అవగాహన కలిగి ఉండాలన్నారు. విద్యార్థులు హర్యానా రాష్ట్ర సంప్రదాయ వేషధారణలో నృత్యాలు, నాటికలు ప్రదర్శించారు. ఉపాధ్యాయులు సంతోష్, వెంకట్‌రావు, కలిముద్దిన్, శోభారాణి, శైలజ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధిహామీ పనుల పరిశీలన



ఉపాధిహామీ పనులు పరిశీలిస్తున్న ఎంపీడీవో సత్యనారాయణ

సిర్పూర్(టి): సిర్పూర్(టి) గ్రామపంచాయతీ పరిధిలోని శివారు ప్రాంతాల్లో జరుగుతున్న జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం పనులను బుధవారం ఎంపీడీవో సత్యనారాయణ పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధిహామీ కూలీలకు పని దినాల్లో పని కల్పించేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. పనులు సకాలంలో పూర్తి చేసుకుని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం ఉపాధిహామీ కూలీల హాజరు శాతం, పని నిర్వహణ పనులను పరిశీలించారు. పంచాయతీ కార్యదర్శి తిరుపతి ఉన్నారు.

ఆకట్టుకున్న సైన్స్‌ఫెయిర్



ఆవిష్కరణలు ప్రదర్శిస్తున్న విద్యార్థులు

రెబ్బెన: మండల కేంద్రంలోని ఎస్వీ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో బుధవారం నిర్వహించిన సైన్స్‌ఫెయిర్ ఎంతో ఆకట్టుకుంది. విద్యార్థుల సృజనాత్మకతకు అద్దం పట్టే రీతిలో విద్యార్థులు వివిధ రకాల ఆవిష్కరణలు ప్రదర్శించి ఆకట్టుకున్నారు. ప్రైవేటు పాఠశాలల సంఘం జిల్లా అధ్యక్షుడు దేవభూషణం సైన్స్ ఫెయిర్‌ను సందర్శించి విద్యార్థులను అభినందించారు. అసిస్టెంట్ మేనేజర్ సాయితేజ, కరస్పాండెంట్ సంజీవ్‌కుమార్, రెబ్బెన ఎంపీపీఎస్ హెచ్‌ఎం అనుషా భాను, విజయకుమారి, రుక్మిణి, తిరుపతి, మౌనిక, హిమబిందు, మంజు, దేవిక, లక్ష్మి పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు ప్రారంభం



కెరమెరి: పరీక్ష కేంద్రానికి వెళ్తున్న బాలికలు



దహెగాం: తనిఖీ చేస్తున్న సిబ్బంది



బెజ్జూర్: పరీక్ష రాసేందుకు వెళ్తున్న విద్యార్థులు



కౌటాల: పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థులు



సిర్పూర్(టి): పరీక్ష కేంద్రం వద్ద బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసులు

రెబ్బెన: ఇంటర్మీడియెట్ వార్షిక పరీక్షలు బుధవారం నుంచి ప్రారంభమయ్యాయి. మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రంలో మొదటిరోజు పరీక్షకు 421 మంది విద్యార్థులకు 404 మంది విద్యార్థులు హాజరయ్యారు. జనరల్ గ్రూప్‌లో 239 మంది విద్యార్థులకు 234, ఒకేషనల్ గ్రూప్‌లో 182 మందికి 170 మంది హాజరయ్యారు. పరీక్ష కేంద్రాన్ని ఏఎస్పీ చిత్తరంజన్ తనిఖీ చేశారు. పరీక్షలకు చీఫ్ సూపరింటెండెంట్‌గా అమరేందర్‌రెడ్డి, డీవోగా మహేశ్వర్ వ్యవహరిస్తున్నారు.

కెరమెరిలో..

కెరమెరి: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియెట్ వార్షిక పరీక్షలు బుధవారం నుంచి ప్రారంభమయ్యాయి. స్థానిక జూనియర్ కళాశాలతో పాటు మోడి కేజీబీవీకి చెందిన మొత్తం 171 మంది విద్యార్థులకు 156 మంది పరీక్షకు హాజరైనట్లు సీఎస్ బైరాగి, డీవో ప్రభాకర్ తెలిపారు. 5 గదుల్లో ఆరుగురు ఇన్విజిలేటర్లు విధులు నిర్వహించారు. పరీక్ష ప్రారంభానికి ముందు కెరమెరి ఎస్సై గుంపుల విజయ్ విద్యార్థులకు పరీక్ష రాసే విధానంపై అవగాహన కల్పించారు. సిట్టింగ్ స్క్వాడ్ సునీల్ పర్యవేక్షించారు.

దహెగాంలో..

దహెగాం: మండల కేంద్రంలోని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం ఇంటర్ ప్రథమ సంవత్సరం వార్షిక పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. ఇంటర్ ప్రథమ సంవత్సరంలో 125 మంది విద్యార్థులు ఉండగా 119 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారని ఆరుగురు గైర్హాజరైనట్లు సీఎస్ గణపతి తెలిపారు. గురువారం ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు ప్రారంభం కానున్నాయని పేర్కొన్నారు. డీవో సత్యనారాయణ ఉన్నారు.

బెజ్జూర్‌లో..

బెజ్జూర్: ఇంటర్మీడియెట్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. బుధవారం బెజ్జూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. ఈ పరీక్షలకు 164 మంది విద్యార్థులకు 153 మంది హాజరు కాగా, 11 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు కళాశాల చీఫ్ సూపరింటెండెంట్, డీవో రాజం కుమార్ తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పరీక్ష కేంద్రాల వద్ద బెజ్జూర్ ఎస్సై ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

కౌటాలలో..

కౌటాల: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం ఇంటర్ వార్షిక మొదటి సంవత్సరం పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. కళాశాల సిబ్బంది విద్యార్థులను తనిఖీ చేసి కేంద్రంలోకి అనుమతించారు. తొలిరోజు పరీక్షకు 310 మంది విద్యార్థులకు గాను 280 మంది విద్యార్థులు హాజరయ్యారు. 30 మంది విద్యార్థులు పరీక్షకు గైర్హాజరయ్యారని సీఎస్ బాలకిషన్‌రావు తెలిపారు. నేటి పరీక్షకు విద్యార్థులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

సిర్పూర్ (టి)లో..

సిర్పూర్(టి): ఇంటర్మీడియెట్ వార్షిక పరీక్షలు బుధవారం మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రంలో ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం వార్షిక పరీక్షలకు 336 మందికి 328 మంది విద్యార్థులు హాజరుకాగా 8 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు.

తిర్యాణిలో..

తిర్యాణి: మండలంలో ఇంటర్ మొదటి సంవత్సర పరీక్షలు తొలిరోజు ప్రశాంతంగా కొనసాగాయి. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం నిర్వహించిన పరీక్షల్లో 217 మంది విద్యార్థులకు గాను 197 మంది విద్యార్థులు హాజరైనట్లు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సత్య గణపతి పేర్కొన్నారు.

నేటి నుంచి క్రికెట్ పోటీలు

కౌటాల: కౌటాల మినీ స్టేడియంలో ఈ నెల 6 నుంచి కౌటాల ప్రీమియర్ లీగ్(కేపీఎల్) క్రికెట్ పోటీలను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు డబ్బా గోపాల్, రాజు, దిలీప్ బుధవారం తెలిపారు. నేడు ఉదయం 10 గంటలకు టోర్నీని ప్రారంభిస్తామని, 15రోజుల పాటు పోటీలు నిర్వహిస్తామన్నారు. పోటీల్లో పది జట్లు పాల్గొంటున్నట్లు వివరించారు. గెలుపొందిన జట్టుకు మొదటి బహుమతి రూ.లక్ష నగదు, ద్వితీయ బహుమతి రూ. 50వేల నగదుతో పాటు షీల్డ్ అందిస్తామని తెలిపారు. క్రీడాకారులకు భోజన వసతి కల్పిస్తామన్నారు.

బొటానికల్ గార్డెన్‌కు సావర్‌ఖేడా విద్యార్థులు



బొటానికల్ గార్డెన్‌లో విద్యార్థులు

కెరమెరి: పీఎంశ్రీకి ఎంపికైన మండలంలోని సావర్‌ఖేడా విద్యార్థులు బుధవారం విజ్ఞాన యాత్ర సందర్భంగా మహారాష్ట్రలోని చంద్రాపూర్ బొటానికల్ గార్డెన్‌కు బయలుదేరారు. అక్కడున్న జంతుజాలంతో పాటు, వివిధ రకాల చేపలు, పాములు, మొక్కలను వీక్షించారు. గార్డెన్, సైన్స్ పరికరాలను పరిశీలించారు. నిత్యం పాఠ్యాంశాల్లో మునిగి ఉన్న విద్యార్థులను విహారయాత్రలకు తీసుకెళ్లాలని కేంద్ర ప్రభుత్వం భావించింది. ఇందులో భాగంగా విహారయాత్రలకు ఒక్కో విద్యార్థికి రూ.500 నిధులు మంజూరు చేసింది. పాఠశాలకు చెందిన 3, 4, 5 తరగతుల విద్యార్థులు బొటానికల్ గార్డెన్‌ను తిలకించారు. ఎంఈవో ఆడే ప్రకాశ్, కెరమెరి, ఝరి కాంప్లెక్స్ హెచ్‌ఎంలు చంద్రశేఖర్, భరత్‌కుమార్, సావర్‌ఖేడా, కెరమెరి హెచ్‌ఎంలు కదేర్ల రంగయ్య, భాస్కర్ తదితరులున్నారు.

బీజేపీ శ్రేణుల సంబరాలు



సంబరాలు చేసుకుంటున్న నాయకులు

కౌటాల: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి అంజిరెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బీజేపీ అభ్యర్థి మల్క కొమురయ్య గెలుపొందడంతో బుధవారం రాత్రి బీజేపీ నాయకులు మండల కేంద్రంలోని కుమురం భీం చౌరస్తాలో బాణాసంచాలు కాల్చి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా పార్టీ మండలాధ్యక్షుడు కుంచాల విజయ్ మాట్లాడుతూ బీజేపీతోనే అభివృద్ధి సాధ్యమని తెలిపారు. బీజేపీ అభ్యర్థుల గెలుపునకు కృషి చేసిన పార్టీ కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు భీమన్న, రవి, మిథున్, చందు, సాయి, తిరుపతి, భూమన్న తదితరులు పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
కొమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా :
9010608462
Office mail : knrjagati@gmail.com

సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
కొమురంభీం ఆసిఫాబాద్ :
తిరుపతి, ACO - 7997958206
సిర్పూర్ కాగజ్‌నగర్ : కె.విజయకుమార్, S.R. - 7672055661
టోల్ ఫ్రీ నెం. : 1800 425 9899